జిల్లాలో వర్షం.. యంత్రాంగం అప్రమత్తం



కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న జేసీ అభిషేక్‌కుమార్

పుట్టపర్తి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో వర్షం కురుస్తోంది. దీంతో శ్రీసత్యసాయి జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ముందస్తు జాగ్రత్తలపై కలెక్టర్ టీఎస్ చేతన్ ప్రత్యేక దృష్టి సారించారు. వర్షాల దృష్ట్యా ఈనెల 16, 17 తేదీల్లో అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించారు. ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. వేరుసెనగ, మొక్కజొన్న, వరిపంట సాగు చేసిన రైతుల్లో అలజడి నెలకొంది. డివిజన్ స్థాయిలో ఆర్డీవోలు, కమిషనర్లు, విద్యుత్తు, గృహ, పోలీసు, వైద్యఆరోగ్య, ఆర్టీసీ, నీటిపారుదల తదితర శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్

కలెక్టరేట్‌లో 24 గంటలపాటు అందుబాటులో ఉండే విధంగా కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే కంట్రోల్‌రూమ్ నంబర్లు 08555 289039, 93929 99719కు సమాచారం అందించాలని సూచించారు. డివిజన్ కేంద్రాల్లోనూ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మంగళవారం కంట్రోల్ రూమ్‌ను జేసీ అబిషేక్‌కుమార్ పరిశీలించారు.

32 మండలాల్లో వర్షపాతం

శ్రీసత్యసాయి జిల్లావ్యాప్తంగా 32 మండలాల్లో సోమవారం రాత్రి నుంచి మంగళవారం వరకు వర్షం కురిసింది. హిందూపురం 26.4 మి.మీ., ఎన్‌పీకుంట 23.4, లేపాక్షి 23.2, నల్లచెరువు 22.0, తలుపుల 21.2, తనకల్లు 20.8, గాండ్లపెంట 17.6, రొళ్ల 16.2, ఓడీసీ 15.2, గోరంట్ల 14.2, అమడగూరు 14.0, చిలమత్తూరు 12.8, అగళి 12.4, కదిరి 11.2, పరిగి 11.2, నల్లమాడ 8.8, మడకశిర 8.2, బుక్కపట్నం 7.2, పుట్టపర్తి 6.2, అమరాపురం 5.6, ముదిగుబ్బ 5.4, పెనుకొండ 4.6, సీకేపల్లి 4.4, సోమందేపల్లి 4.4, ధర్మవరం 4.2, రొద్దం 4.0, తాడిమర్రి 3.2, బత్తలపల్లి 2.4, కనగానపల్లి 2.2, రామగిరి 1.0 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైనట్లు జిల్లా ప్రణాళికాధికారి విజయ్‌కుమార్ తెలిపారు.

కార్యాలయంలో కంప్యూటర్లకూ రక్షణ కరవు

తలుపుల, న్యూస్‌టుడే: తేలికపాటి వర్షం కురిసినా తలుపుల సొసైటీ కార్యాలయం తడిసి ముద్దయిపోతుంది. అందులోని కంప్యూటర్లు, విలువైన వస్తువులు పాడైపోకుండా సిబ్బంది ముందు జాగ్రత్తగా వాటిపై ప్లాస్టిక్ పట్టలు కప్పుతున్నారు. ఈ భవనం చాలా పాతది కావడంతో తేలికపాటి వర్షం వచ్చినా పైకప్పు కారుతోంది. ప్రత్యామ్నాయ మార్గం లేకపోవడంతో సిబ్బంది ఇలా జాగ్రత్తలు తీసుకొంటున్నారు. ఈ విషయంపై సంబంధిత సీవో చంద్రను వివరణ కోరగా భవనం కారుతోంది. రాత్రివేళ పెద్ద వర్షం వస్తే మొత్తం కారే ప్రమాదం ఉంది. దీంతో ముందుజాగ్రత్తగా కంప్యూటర్లపై ప్లాస్టిక్ పట్టలు కప్పినట్లు తెలిపారు.



తలుపుల సొసైటీలో కంప్యూటర్లు తడిసిపోకుండా కప్పిన ప్లాస్టిక్ పట్టలు

రాష్ట్రస్థాయి క్రికెట్ ప్రాబబుల్స్‌కు కదిరి క్రీడాకారిణి



తేజశ్విని

కదిరి, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి అండర్-15 ప్రాబబుల్స్ క్రికెట్ పోటీలకు కదిరి క్రీడాకారిణి ఎంపికైనట్లు కోచ్ నజీర్ తెలిపారు. ఈనెల 18 నుంచి విజయనగరంలో మొదలయ్యే ప్రాబబుల్స్‌కు క్రీడాకారిణి తేజశ్విని పాల్గొంటోంది. ఇటీవల వెంకటగిరిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యధిక వికెట్లను సాధించటమేగాక ఎకానమీ రేట్‌లో కూడా రాణించడంతో ప్రాబబుల్స్‌లో చోటు దక్కింది. విద్యార్థినికి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ స్మిత క్రీడా దుస్తులు ఇచ్చి, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల పీడీ నరసింహాచారి, అధ్యాపకులు పాల్గొన్నారు.

24 గంటల వైద్య సేవలేవీ?

- పీహెచ్‌సీల్లో అరకొరే..
- పలుచోట్ల అందుబాటులో ఉండని వైద్యులు

అనంతపురం (వైద్యం), పుట్టపర్తి, ఉరవకొండ, చెన్నేకొత్తపల్లి, బెళుగుప్ప, అమడగూరు, న్యూస్‌టుడే

న్యూస్‌టుడే ప్రత్యేక పరిశీలన

ప్రజలకు అందుబాటులో ఉండటంతోపాటు సకాలంలో వైద్యసేవలు అందించేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ) జిల్లా వ్యాప్తంగా ఉన్నాయి. 24 గంటల పాటు రోగులకు సేవలు అందించాలని ఓవైపు సర్కారు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఆయా కేంద్రాలలో పనిచేస్తున్న కొంతమంది వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండటం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా వైద్యులు స్థానికంగా ఉండకుండా పట్టణాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. పలుచోట్ల రోగులకు స్టాఫ్‌నర్సులే చికిత్స చేస్తున్నారు. మధ్యాహ్నం దాటిన తరువాత వైద్యులు ఉండకపోవటంతో వచ్చిన కేసులను ఇతర ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నారు. మరోవైపు నెలకు కనీసం ఐదు నుంచి పది ప్రసవాలు పీహెచ్‌సీల్లో చేయాలని ఉన్నతాధికారులు లక్ష్యాన్ని నిర్దేశించినా పట్టించుకోవటం లేదు. దీంతో గర్భిణులు వ్యయప్రయాసలతో ఇతర ప్రాంతాల్లోని వైద్యశాలలకు వెళ్లాల్సి వస్తోంది. ప్రతి నెలా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు పీహెచ్‌సీ వైద్యులతో సమీక్షా సమావేశాలు నిర్వహించి ప్రసవాల శాతం పెంచాలని ఆదేశిస్తున్నా ఆశించిన ఫలితం కనిపించలేదు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు పీహెచ్‌సీల్లో ప్రసవాల తీరును పరిశీలిస్తే.. అనంతపురం జిల్లా పరిధిలో 1,826, శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో 411 కాన్పులు జరిగాయి. మరోవైపు పలు పీహెచ్‌సీల్లో ఇతర సమస్యలు నెలకొన్నాయి.



వచ్చారు.. వెళ్లారు!

వజ్రకరూరు మండలం గడేహోతూరులో ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం పరిధిలో 11 గ్రామాలు ఉండగా రోజూ ఓపీకి 60 మంది వస్తున్నారు. నెలకు సగటున 2 కాన్పులు చేస్తున్నారు. కేంద్రంలో ఇద్దరు వైద్యులకు గాను ఒకరు ప్రసూతి సెలవులో ఉన్నారు. మంగళవారం ఉదయం 10.45 గంటలకు వైద్యుడు వచ్చారు. మధ్యాహ్నం 12.15 గంటలకు 104 వైద్యసేవలు ఉన్నాయంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. తరువాత విధుల్లో ఉన్న స్టాఫ్‌నర్సు, ఫార్మసిస్టులే రోగులకు మందులు ఇచ్చి పంపారు. శుభ్రత అంతంతమాత్రమే. తాగునీటి ఫిల్టర్ పని చేయడం లేదు. నీటిక్యాన్‌ను మాత్రమే ఉంచారు.

ఒక్కో పీహెచ్‌సీలో 14 మంది..

ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు, ముగ్గురు స్టాఫ్‌నర్సులు, కమ్యూనిటీ హెల్త్‌ఆఫీసర్, పబ్లిక్‌హెల్త్ ఆఫీసర్, హెల్త్ ఎడ్యుకేటర్‌తో కలిపి మొత్తం 14మంది ఉంటారు. రోగులకు అవసరమయ్యే మందులు అందుబాటులో ఉంచాలి. వివిధ రక్తపరీక్షలు చేసేందుకు ల్యాబ్ టెక్నీషియన్‌ను నియమించారు. కేంద్రంలో ఆరు పడకలు ఉండాలి. వైద్యులు పనిచేసే ప్రాంతంలోనే నివాసం ఉండాలి. రాత్రి వేళల్లో రోగులు వస్తే... విధుల్లో ఉండే సిబ్బంది ఫోన్ ద్వారా వైద్యుడికి సమాచారం ఇస్తే.. పీహెచ్‌సీకి వచ్చి రోగికి చికిత్స చేయాలి. చాలా కేంద్రాలలో రాత్రి వేళల్లో వైద్యులు అందుబాటులో ఉండటం లేదని ఆరోపణలు వస్తున్నాయి. దీంతో ఇతర ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆసుపత్రులకు సిబ్బంది రెఫర్ చేస్తున్నారు.

కళ్యాణదుర్గం వెళ్లాల్సిందే..

బెళుగుప్ప ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యుల్లో ఒకరు సెలవులో ఉన్నారు. రాత్రి వేళల్లో వైద్యులు అందుబాటులో ఉండటం లేదని స్థానికులు చెబుతున్నారు. దీంతో కళ్యాణదుర్గం వెళుతున్నారు. చిన్నపాటి ప్రమాదాలు జరిగినా ఇతర ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తోందని పలువురు పేర్కొన్నారు.

వైద్యపరికరాల కొరత

చెన్నేకొత్తపల్లి మండలం ఎన్ఎస్ గేట్‌లోని పీహెచ్‌సీలో గతంలో నెలకు సుమారు 15 నుంచి 20 ప్రసవాలు జరిగేవి. ప్రస్తుతం ఒకటి రెండు మాత్రమే నమోదవుతున్నాయి. దీంతో గర్భిణులు చాలా వరకు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. సిజేరియన్ చేసేందుకు అవసరమైన వైద్యపరికరాలు అందుబాటులో లేవు.

ఇరు జిల్లాల్లో ఇలా..

జిల్లా	పీహెచ్‌సీలు	వైద్యులు
అనంత	45	90
శ్రీసత్యసాయి	41	82

అందరూ అందుబాటులో ఉండాలి

- ఈబీ.దేవి, మంజువాణి, డీఎంహెచ్‌వోలు, అనంత, శ్రీసత్యసాయి జిల్లా

పీహెచ్‌సీ వైద్యులు 20 కిలోమీటర్ల పరిధిలోనే నివాసం ఉండాలి. సాయంత్రం 4 గంటల తరువాత ఫోన్‌కాల్ చేస్తే అందుబాటులోకి రావాలి. రాత్రి సమయాల్లో వచ్చే క్షతగాత్రులు, రోగులకు వైద్యసేవలు అందించాలి. ప్రసవాల సంఖ్య పెంచాలని చెబుతున్నాం. కొన్ని చోట్ల సక్రమంగా అమలు కాని మాట వాస్తవమే. బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటలకు వరకూ వైద్యులు విధిగా సేవలు అందించాలి. ఎవరైనా ఉండకపోతే వారిపై చర్యలు తీసుకుంటాం. ఇతర సమస్యలు ఏవైనా ఉంటే పరిష్కరిస్తాం.



అమడుగూరు పీహెచ్‌సీలో నిరుపయోగంగా కొత్త సీసీ కెమెరాలు

ఆరు నెలలు.. ఎనిమిది ప్రసవాలు

అమడగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరు నెలలకు ఎనిమిది ప్రసవాలు చేశారు. సిజేరియన్ అవసరమైతుందనుకుంటే కదిరి ప్రభుత్వాసుపత్రికి రెఫర్ చేస్తున్నారు. ఎనిమిది నెలల క్రితం నాలుగు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వాటికి కనెక్షన్లు ఇవ్వకపోవడంతోపాటు మానిటర్‌ను ఏర్పాటు చేయలేదు. దీంతో కొత్తగా ఏర్పాటు చేసినవి నిరుపయోగంగా మారాయి.

అనంతకు టీజీ.. శ్రీసత్యసాయికి అనగాని

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రుల నియామకం



టీజీ భరత్ — అనగాని సత్యప్రసాద్

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమంపై తరచూ పర్యవేక్షణ, పరిశీలన చేయడానికి జిల్లాలకు ఇన్‌ఛార్జి మంత్రులను నియమించారు. ఇందుకు సంబంధించి మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం తగిన ఉత్తర్వు జారీ చేశారు. అనంత జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా కర్నూలుకు చెందిన రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఆహార శాఖల మంత్రి టీజీ భరత్, శ్రీసత్యసాయి జిల్లాకు రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్-స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌లను నియమించారు. ఆయా జిల్లాల్లో జరిగే అభివృద్ధి, సంక్షేమంపై పర్యవేక్షణ చేయనున్నారు. జిల్లాల ప్రజాప్రతినిధులు, అధికారులను సమన్వయం చేస్తూ ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు పేదలకు చేర్చడమే వీరి ముఖ్యోద్దేశం. మరో వైపు.. అనంత జిల్లాకు చెందిన రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక వాణిజ్య పన్నులశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను నంద్యాల జిల్లాకు, శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత జౌళి శాఖల మంత్రి ఎస్.సవితను కడప జిల్లా, రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను ఎన్టీఆర్ జిల్లాకు ఇన్‌ఛార్జిగా నియమించారు. త్వరలోనే సంబంధిత మంత్రులు నిర్దేశిత జిల్లాల్లో పర్యటించనున్నారు.

నేడు మద్యం కొత్త దుకాణాల ప్రారంభం

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో నేడు (బుధవారం) నూతన ప్రైవేటు మద్యం దుకాణాలు ప్రారంభమవుతాయని డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య మంగళవారం ప్రకటనలో తెలిపారు. అనంతపురం జిల్లాలో 136, శ్రీసత్యసాయి జిల్లాలో 87 దుకాణాలను ఏర్పాటు కాబోతున్నాయి. దుకాణాలను దక్కించుకున్న వారు లైసెన్సు రుసుములు చెల్లించారన్నారు. మద్యం నిల్వలకు ఆన్‌లైన్‌లో ఇండెంట్‌లు తీసుకుని సోములదొడ్డి వద్దనున్న ఐఎంఎల్ డిపోలో అందజేశారని, కొందరు మంగళవారం రాత్రి సరకును దుకాణాలకు తరలించారని తెలిపారు.

'బాధితులను ఆదుకొంటాం'

హిందూపురం: మహిళలపై అత్యాచారానికి పాల్పడటం క్రూరమైన చర్య అని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ షేక్ రుకియాబేగం పేర్కొన్నారు. మంగళవారం బాధితులను పరామర్శించిన ఆమె పట్టణ రెండో పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. దుర్మార్గులను వదలిపెట్టవద్దని, వీరు బెయిల్‌పై వచ్చినా రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు. బాధిత మహిళలను ఆదుకుంటామన్నారు.

ఒంటరిగా ఉన్న వారే లక్ష్యం

హిందూపురం, న్యూస్‌టుడే: చిలమత్తూరు మండలంలో సామూహిక అత్యాచారానికి ఒడిగట్టి అరెస్టయిన నిందితులు ఒంటరిగా ఉన్నవారు, భార్య, భర్తలున్న వారినే లక్ష్యంగా చేసుకొని దోపిడీ, అత్యాచారాలకు పాల్పడుతూ వచ్చారని ఎస్పీ వివరించారు. అరెస్టు చేసిన సమయంలో ఎస్పీ పలు విషయాలు వెల్లడించారు. కర్ణాటకతోపాటు రాష్ట్రంలోనూ అనేక ఘోరాలకు పాల్పడినట్లు వివరించారు. సంఘటనలో నిందితులకు ప్రత్యేక కోర్టుద్వారా కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకొంటామన్నారు. ఎవరైనా మహిళలపై అనుచితంగా ప్రవర్తిస్తే సహించేది లేదని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా గట్టి ప్రణాళికతో ముందుకు వెళతామన్నారు. ఈ సంఘటనలో నిందితులను 48 గంటల్లో గుర్తించి అరెస్ట్ చేసినందుకు సీఎం, హోంమంత్రి, డీజీపీ జిల్లా పోలీసులను అభినందించినట్లు ఎస్పీ తెలిపారు. నిందితుల ఆచూకీ గుర్తించటంలో డీఎస్పీ మహేశ్, సీఐలు ఆంజనేయులు, అబ్దుల్‌కరీం, జనార్దన్, రాఘవ, లేపాక్షి ఎస్ఐ నరేంద్ర, ఎస్‌బీ ఎస్ఐ ప్రదీప్‌కుమార్, క్రైం సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డులు అందించారు.

నిందితులకు కఠినశిక్ష పడేలా సీఎం దృష్టికి తీసుకెళ్తా..

హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ

హిందూపురం: అత్తా, కోడలిపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కలిసి కోరతానని నియోజకవర్గం ఎమ్మెల్యే బాలకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం రాత్రి ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు. ఉపాధికి వలస వచ్చిన మహిళలపై ఇలాంటి అఘాయిత్యం జరగటం బాధాకరమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని, అందుకు తన సహకారం ఉంటుందన్నారు. హిందూపురంలో మహిళలకు భద్రత కల్పించే బాధ్యత తమదేన్నారు. ఇలాంటి వాటికి ప్రజలు భయపడాల్సిన అవసరం లేదన్నారు. అత్యాచారానికి గురైన కుటుంబానికి తనవంతు సహకారం ఉంటుందని, వీరికి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. ఈ సంఘటనలో నిందితులను 48 గంటల్లో అరెస్ట్ చేసిన పోలీసులకు ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు.



మట్కా చట్రం.. బతుకులు ఛిద్రం!

● చాపకింద నీరులా విస్తరిస్తున్న జూదం ●అరెస్టులున్నా యథేచ్ఛగా కొనసాగింపు

తాడిపత్రి పట్టణం నందలపాడుకు చెందిన ఓ వ్యక్తి భవన నిర్మాణ కార్మికుడు. రోజుకు రూ. 800లు కూలీ వస్తుంది. వచ్చిన కూలి వచ్చినట్టే మట్కాలో పెడుతూ.. పనులు లేని రోజుల్లో వడ్డీకి డబ్బులు తెచ్చి మరీ ఆడుతున్నాడు. కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లోకి దిగజారింది. ఇంటిని తాకట్టు పెట్టాడు. కుటుంబం రోడ్డున పడాల్సిన పరిస్థితి దాపురించింది.

అనంత నేరవార్తలు, తాడిపత్రి, పెద్దపప్పూరు, గుత్తి, న్యూస్‌టుడే: సులువుగా డబ్బు సంపాదించాలన్న ఆశ కొందరిని మట్కాకు వైపు నడిపిస్తోంది. వ్యసనపరులుగా మారుస్తోంది. రోజుకూలీలు, ఆటోడ్రైవర్లు దీనికి బానిసలుగా మారి సర్వం పోగొట్టుకుంటున్నారు. కొంతకాలంగా స్తబ్దుగా ఈ జాడ్యం మళ్లీ తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు ప్రాంతాల్లో ఓ మాఫియా అవతారమెత్తింది.

ఆన్‌లైన్‌లోనూ అధికమే..

స్మార్ట్‌ఫోన్లలో కొన్ని మట్కా యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. కళ్యాణ్ మట్కా కింగ్, సత్తా మట్కా, ఫాస్ట్ రిజల్ట్, ఎస్కే మట్కా అప్లికేషన్లలో ఎక్కువగా జూదమాడుతున్నారు. వీటిలో పదికి రూ.100లు వస్తుందని ఆన్‌లైన్ మట్కాకు అలవాటు పడ్డారు. యువత ఆన్‌లైన్ ఆటతో నష్టపోతున్నారు. జిల్లావ్యాప్తంగా ప్రతిరోజు రూ.లక్షల్లో మట్కా వ్యాపారం జరుపుతున్నట్లు సమాచారం.

నాయకులు, పోలీసుల అండ

ఆయా పట్టణాల్లో కొందరు రాజకీయ పార్టీల నాయకుల అండదండలు ఉన్న వ్యక్తులే నిర్వాహకులుగా అవతారమెత్తుతున్నారు. తూతూమంత్రంగా కేసులు నమోదు చేసి వదిలేస్తున్నారు. కొందరు పోలీసులు మట్కా ముఠాలతో సంబంధాలు పెట్టుకుని వారికి సహకరిస్తున్నట్లు విమర్శలు ఉన్నారు.

గుత్తిలో జోరుగా..

గుత్తి మట్కాకు పుట్టిన ఇల్లు. 30 ఏళ్ల కిందట ఇక్కడ మట్కా బహిరంగంగా జోరుగా సాగేది. ఇక్కడికి కర్నూలు జిల్లా నుంచి ఆటగాళ్లు అధికంగా వచ్చేవారు. పురపాలికలో 25 వార్డులుండగా ప్రతి వార్డులో ముగ్గురు నలుగురు బీటర్లు ఉన్నారంటే ఏస్థాయిలో సాగుతోందో అర్థం అవుతోంది. దళితవాడ, బండగేరి, బీసీకాలనీ, చెర్లోపల్లి కాలనీ, గాంధీనగర్, గుత్తి ఆర్.ఎస్ తదితర ప్రాంతాల్లో జోరుగా సాగుతోంది.

ఏజెంట్లను నియమించుకుని...

కొందరు బడానాయకులు నిర్వాహకులుగా అవతారమెత్తుతూ తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, కర్ణాటకలోని బళ్లారి పట్టణం కేంద్రంగా మట్కాను శాసిస్తున్నారు. నిర్వాహకులు రూపాయికి రూ.9, పదికి రూ.90 చొప్పున ఇస్తామని ఆశచూపుతూ పగలు రాత్రి అనే తేడా లేకుండా దందా నడిపిస్తున్నారు. గ్రామాల్లో ఏజెంట్లను నియమించుకుని కమీషన్లు ఇస్తూ మట్కా రాయిస్తున్నారు. మట్కా రాసే బీటర్లు నిర్వాహకులకు ఏజెంట్ల ఫోన్ల ద్వారా చేరవేస్తున్నారు. ఒక్క తాడిపత్రిలోనే ప్రతి రోజు ఉదయం, సాయంత్రం రెండు ఆటలకు సంబంధించి రూ.50 లక్షల వరకు మట్కా జరుగుతుందని అంచనా. తాడిపత్రి పట్టణంలో సిమెంటు, స్టీల్, గ్రానైట్, నాపరాళ్ల పరిశ్రమలు ఎక్కువగా ఉండటంతో అక్కడ పని చేసే కార్మికులు ఎక్కువ సంఖ్యలో దీనివైపు బానిసలయ్యారు. పట్టణంలో 36 వార్డుల్లో 18 మంది మట్కా నిర్వాహకులు ఉన్నారు.

ఎక్కడ.. ఎలాగంటే!

● అనంతపురం నగరం పాతూరు పరిధిలో భవానీనగర్, రాణీనగర్, వేణుగోపాల్ నగర్, బుడ్డప్పనగర్‌లలో కొందరు ఇళ్లలోనే మట్కా కేంద్రాలు నడుపుతున్నారు. గుత్తి, టీవీ టవర్, తాడిపత్రి రోడ్డు శివార్లలో చెట్లపొదలు, ఖాళీ ప్రదేశాల్లో ఆడుతున్నారు. నగరంలో ఇటీవల పట్టుబడిన వారిలో మహిళలు కూడా ఉండటం గమనార్హం. ఈనెల 7న వన్‌టౌన్ పోలీసులు జరిపిన దాడుల్లో ఏడుగురు బీటర్లు పట్టుపడగా, వారి నుంచి రూ.70 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు.

● తాడిపత్రి పట్టణం అంబేడ్కర్‌నగర్, బస్టాండ్‌కూడలి, మెయిన్‌బజార్, గాంధీకట్ట, నందలపాడు, బండామసీదు విజయనగర్ కాలనీ, టైలర్స్ కాలనీల్లో ఆట యథేచ్ఛగా సాగుతోంది. తాడిపత్రి పట్టణంలోనే రోజులో రూ.అరకోటి వ్యాపారం జరుగుతోందని అంచనా.

● రాయదుర్గం, బొమ్మనహాళ్, డి.హీరేహాళ్ మండలాల్లో, ఉద్దేహాళ్, ఉంతకల్లు, గోనేహాళ్ క్రాస్ గ్రామాల్లో మట్కా మాఫియా రెచ్చిపోతోంది. బళ్లారి, ఎత్తిన బూదేహాళ్ నుంచి వచ్చే ఏజెంట్లు గుట్టుచప్పుడు కాకుండా మట్కా నిర్వహిస్తున్నారు.

నివారణపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో మట్కా నివారణపై ప్రత్యేక దృష్టి సారించాం. గత నెల 25 నుంచి ఈ నెల 14 వరకు మట్కా ఆడే 79 మందిని అరెస్టు చేశాం. 39 కేసులు నమోదు చేశాం. బీటర్ల నుంచి రూ.9 లక్షల 42 వేల నగదు స్వాధీనం చేసుకున్నాం. దాడులు చేస్తూ కేసులు నమోదు చేస్తున్నాం. త్వరలో మట్కా అనేది లేకుండా చేస్తాం.

- పి.జగదీశ్, ఎస్పీ, అనంతపురం

జల సంరక్షణలో హంపాపురానికి జాతీయస్థాయి గుర్తింపు



సేద్యపుకుంటలో నీరు ఇలా..

లక్ష్మీనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: జల సంరక్షణలో జాతీయస్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీగా రాప్తాడు నియోజకవర్గం పరిధి హంపాపురాన్ని కేంద్ర జలశక్తి అభియాన్ ఎంపిక చేసింది. 2022-23 సంవత్సరంలో హంపాపురం పంచాయతీ వాటర్ షెడ్ పథకం కింద ఎంపిక కాగా 2023-24 సంవత్సరం పరిధిలో నీటి సంరక్షణ కోసం వివిధ రకాల అభివృద్ధి పనులు చేపట్టారు. వాటర్ షెడ్ పథకం అమలు కాకముందు పంచాయితీ పరిధిలో 31 మీటర్ల లోతులో భూగర్భజలాలు ఉండేవి. వాటర్‌షెడ్, ఉపాధి హామీ పథకం కింద కందకాలు, రాతికట్టలు, చెక్‌డ్యాం, పారంపాండ్, నీటికుంటలు వంటి వివిధ రకాల 78 రకాల నీటి సంరక్షణ పనులను రూ.1.49 కోట్లు వెచ్చించి చేపట్టారు. భూగర్భజలాలు 25 మీటర్లపైకి వచ్చాయి. పంచాయితీ పరిధి గ్రామాల్లో వివిధ రకాల పంటలు, పండ్ల తోటలను రైతులు సాగు చేస్తున్నారు. వాటర్‌షెడ్, ఉపాధిహామీ పథకం కింద పంచాయితీ పరిధిలో చేపట్టిన పనులను కేంద్ర జలశక్తి అభియాన్ నోడల్ అధికారి నాలుగు నెలల క్రితం వచ్చి అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దేశవ్యాప్తంగా మూడు పంచాయితీలను కేంద్ర నీటి సంరక్షణ అవార్డుల కింద ఎంపిక చేయగా ఇందులో హంపాపురం ఉందని అనంతపురం జిల్లా డ్వామా పీడీ సలీం, అడిషనల్ పీడీ సుధాకర్ రెడ్డి తెలిపారు. ఈనెల 22న దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో రాష్ట్రపతి అవార్డులను అందజేస్తారని తెలిపారు.

శుభ్రత.. ఆరోగ్యానికి దోహదం : డీఆర్ఎం

గుంతకల్లు, న్యూస్‌టుడే : పరిశుభ్రత ఆరోగ్యానికి దోహదం చేస్తుందని డీఆర్ఎం విజయకుమార్ పేర్కొన్నారు. మంగళవారం గుంతకల్లు డీఆర్ఎం కార్యాలయంలో రైల్వే డివిజన్‌లో నెలరోజుల పాటు కొనసాగిన స్వచ్ఛతా పక్వాడా (స్వచ్ఛ భారత్) ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటే అది మనల్ని రోగాల బారిన పడకుండా చేస్తుందని చెప్పారు. శుభ్రత వల్ల కలిగే ప్రయోజనాలను గుర్తించాలని సూచించారు. నెలరోజుల పాటు రైల్వే స్టేషన్లు, హోటళ్లు, కార్యాలయాలను శుభ్రంగా ఉంచేలా చేపట్టిన కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలన్నారు. స్వచ్ఛతా పక్వాడాలో చురుకుగా పాల్గొన్న విద్యార్థులు, ఉద్యోగులకు ఆయన జ్ఞాపికలను అందజేశారు. పరిసరాల శుభ్రతపై డీఆర్ఎం కార్యాలయం నుంచి వివిధ కాలనీల్లో చైతన్య ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం సుధాకర్, సీనియర్ డీపీఓ జయశంకర్ చౌహాన్, సీనియర్ డీసీఎం మనోజ్, కోఆర్డినేషన్ శ్రీనివాసులు ఇతర శాఖల అధికారులు, రైల్వే ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉద్యోగికి జ్ఞాపిక అందజేస్తున్న డీఆర్ఎం విజయకుమార్

నిందితుల కదలికలపై నిఘా ఉంచండి

హిందూపురం, న్యూస్‌టుడే: ఉప కారాగారంలో ఉన్న నిందితుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని సబ్‌జైల్ అధికారులకు జిల్లా న్యాయాధికారి సంస్థ కార్యదర్శి శివప్రసాద్‌యాదవ్ సూచించారు. మంగళవారం హిందూపురం ఉపకరాగారాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కారాగారంలో ఎంత మంది నిందితులు ఉన్నారు. ఏ నేరాలపై వచ్చారు. వీరికి న్యాయవాదులు ఉన్నారా లేదా అనే విషయాలు జైలు అధికారి అంజినాయక్‌ను అడిగి తెలుసుకొన్నారు. సబ్‌జైల్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, వంటగది, పరిసరాలు, మరుగుదొడ్లు, గదులు శుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం జిల్లా న్యాయాధికారి సంస్థ కార్యదర్శి నిందితులతో నేరుగా మాట్లాడి ఆహారం, ఇతర సదుపాయాలు ఎలా ఉన్నాయని తెలుసుకొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాసరెడ్డి, న్యాయవాది నవేరా, లోక్‌అదాలత్ సిబ్బంది శారద, హేమావతి పాల్గొన్నారు.



ఉపకారాగారంలో సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి సంస్థ కార్యదర్శి శివప్రసాద్‌యాదవ్

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

పెనుకొండ: స్థానిక ఉపకారాగారాన్ని మంగళవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కారాగారంలోని బ్యారెక్‌లు, మరుగుదొడ్లు, సరకుల నిల్వ గది, ఉచిత న్యాయ సలహా కేంద్రంలోని పలు రికార్డులను పరిశీలించారు. శిక్ష పూర్తయి బయటకువెళ్లిన తరువాత సత్ప్రవర్తనతో మెలగాలని ఖైదీలకు సూచించారు. ఆయన వెంట కారాగారం సూపరింటెండెంటు అజ్గర్‌హుస్సేన్, లోక్ అదాలత్ కోర్టు సిబ్బంది ఉన్నారు.

వాల్మీకుల చిరకాల కోరిక తీర్చండి: కాలవ



మంత్రి లోకేశ్‌కు వాల్మీకి చిత్రపటం అందిస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

అనంతపురం (కళ్యాణదుర్గంరోడ్డు), రాయదుర్గం: న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌లో దశాబ్దాల కాలంగా వాల్మీకి (బోయ) ఎస్టీ జాబితాలోకి చేర్చాలన్న చిరకాల కోరికను తీర్చాలని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కోరారు. ఎస్టీ పునరుద్ధరణ కోసం కొన్నేళ్లుగా ఎదురు చూస్తున్నారన్నారు. మంగళవారం ఉండవల్లి ముఖ్యమంత్రి నివాసంలో రాష్ట్ర మానవ వనరులశాఖ మంత్రి లోకేశ్‌ను ఎమ్మెల్యే కలిసి వాల్మీకి చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలిశారు. ముందుగా ఈనెల 17న మహర్షి వాల్మీకి జయంతిని రాష్ట్రపండుగగా నిర్వహించేందుకు ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు.

● కణేకల్లులో డిగ్రీ కళాశాలను మంజూరు చేయాలని కాలవ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. రాయదుర్గం పాలిటెక్నిక్ కళాశాలలో స్పాంజి ఐరన్ పరిశ్రమలో లభించే ఉపాధి అవసరాలకు అనుగుణంగా నూతన కోర్సులను ప్రారంభించాలన్నారు.

● రాయదుర్గం ప్రభుత్వాస్పత్రిలో వైద్యుల నియామకానికి చర్యలు తీసుకోవాలని కాలవ విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం నలుగురు వైద్యులు మాత్రమే ఉన్నారని, రోగులకు సేవలు అందించడానికి ఇబ్బందిగా మారిందని మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు వివరించారు.

భారతావని ఒక్కతాటిపై నిలవాలి..



సోమందేపల్లి, న్యూస్‌టుడే: దేశంలో ప్రజలందరూ సమానమే. భారతావని ఒక్కతాటిపై నిలవాలనే నినాదంతో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు సైకిల్ యాత్రను చేపడుతున్నట్లు భాస్కర్ తెలిపారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మరో ముగ్గురితో కలసి చేపట్టిన సైకిల్ యాత్ర మంగళవారం మధ్యాహ్నం సోమందేపల్లి మీదుగా సాగింది. ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'రేస్ అక్రాస్ ఇండియా' పేరుతో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు నలుగురు కలసి 3,723 కిలోమీటర్ల సైకిల్ యాత్రను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలందరూ సమైక్యత, సామరస్య పూర్వకంగా జీవనం సాగిస్తూ.. భారత దేశాన్ని ఒక్కతాటిపై నిలిపేందుకు కృషి చేయడం ద్వారా ప్రపంచానికి స్ఫూర్తిదాయకంగా నిలవాలని సైకిల్ యాత్రికుడు ఆశాభావం వ్యక్తం చేశారు.

అందరికీ ఆదర్శం అబ్దుల్ కలాం

పెనుకొండ, న్యూస్‌టుడే: భారత దేశం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నతమైన వ్యక్తి అబ్దుల్ కలాం అందరికీ ఆదర్శనీయుడని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత అన్నారు. మంగళవారం ఆయన 93వ జయంతి సందర్భంగా అబ్దుల్‌కలాం సామాజిక సేవ కమిటీ ఆధ్వర్యంలో పెనుకొండ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్దగల అబ్దుల్‌కలాం విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు బాల్యంలో కలాం కష్టాలు పడినప్పటి నుంచి దేశ రాష్ట్రపతి అయ్యేంతవరకు, మిసైల్‌మ్యాన్‌గా పేరుపొందిన ఆయన విజయాలను గుర్తుచేసుకున్నారు. కలాం పిలుపు మేరకు యువత కలలు కనడమే కాకుండా వాటిని సాకారం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కమిటీ సభ్యులు, ఎన్డీఏ కూటమి శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీకళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఘనంగా నిర్వహించారు.



పూలమాల వేస్తున్న మంత్రి సవిత, తదితరులు

అంగన్‌వాడీ ఇంటర్వ్యూలు వాయిదా

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: ప్రస్తుత జిల్లాలో కురుస్తున్న వర్షాల కారణంగా ఈ నెల 16 నుంచి మూడు రోజులపాటు 84 అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి జరగాల్సిన ఇంటర్వ్యూలను వాయిదా వేసినట్లు ఐసీడీఎస్ పీడీ బీఎన్ శ్రీదేవి తెలిపారు. ఈ ఇంటర్వ్యూలను ఇదే నెల 23 నుంచి నిర్వహిస్తామని ఆమె తెలిపారు. 23న అనంత రెవెన్యూ డివిజన్, 24న కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్, 25న గుంతకల్లు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఇంటర్వ్యూలు కొనసాగుతాయి. ఆయా డివిజన్ల ఆర్డీఓ కార్యాలయాల్లో ఉదయం 10 గంటలకు ఈ ప్రక్రియ మొదలవుతుందన్నారు. మౌఖిక పరీక్షల తేదీల మార్పును అభ్యర్థినులు గమనించాలని ఆమె సూచించారు. ఇదే విషయాన్ని సీడీపీఓల ద్వారా తగిన సమాచారం పంపిస్తున్నామన్నారు.

నోటీసులివ్వకుండా తనఖా బంగారం వేలం

ఫైనాన్స్ సంస్థ ఉద్యోగులపై కేసు నమోదు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే : అనంతపురం నగరంలోని నాలుగో పట్టణ పోలీస్‌స్టేషను పరిధిలో ఉన్న ఓ గోల్డ్ ఫైనాన్స్ సంస్థ ఉద్యోగులపై మంగళవారం కేసు నమోదైంది. అనంత గ్రామీణంలోని ఆకుతోటపల్లికి చెందిన ప్రైవేటు ఉద్యోగి గంగాధర్ నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డులోని కీర్తన గోల్డ్ ఫైనాన్స్ సంస్థలో ఈ ఏడాది ఏప్రిల్ 20న రెండు దఫాలుగా 336 గ్రాముల బంగారాన్ని తనఖా పెట్టాడు. మొత్తం రూ.18,71,682లు రుణం తీసుకున్నాడు. ఈ రుణంలో రూ.13,11,976కు సంబంధించి జులై 10న రూ.35 వేలు వడ్డీ చెల్లించాడు. మిగతా రుణానికి చెల్లించలేదు. ఫైనాన్స్ ప్రతినిధులు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా బంగారాన్ని వేలం వేశారు. ఈ విషయంపై బాధితుడు సంస్థ ఉద్యోగులను సంప్రదించినప్పటికీ స్పందించలేదు. పోలీసులను ఆశ్రయించాడు. రుణానికి వడ్డీ చెల్లించినప్పటికీ ఆభరణాలను వేలం వేసి తనను మోసం చేశారని బాధితుడు గంగాధర్.. ఫైనాన్స్ మేనేజర్ నారాయణ నాయక్, సేల్స్ మేనేజర్ లక్ష్మీప్రసాద్‌లపై ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పరిశ్రమల శాఖ అధికారిగా శ్రీధర్ బాధ్యతల స్వీకారం

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: జిల్లా పరిశ్రమలశాఖ అధికారిగా (డీఐఓ) జీఎం శ్రీధర్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి అధికారి నాగరాజారావును అనకాపల్లికి బదిలీ చేసిన సంగతి తెలిసిందే. ఇదే స్థానంలో పని చేస్తున్న శ్రీధర్ అనంత డీఐఓగా బదిలీపై వచ్చారు. ఇన్‌ఛార్జిగా పని చేస్తున్న ఏడీ రాజశేఖర్‌రెడ్డి డీఐఓ బాధ్యతలను అప్పగించారు. పదవీ బాధ్యతలు తీసుకున్న కొత్త డీఐఓ శ్రీధర్‌కు పలువురు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో పరిశ్రమల పురోభివృద్ధికి, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సాహించడానికి ప్రత్యేక కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించే ఎంఎస్ఎంఈల అభివృద్ధికి శక్తివంచన లేకుండా పని చేస్తామన్నారు.

48 గంటల్లోనే నిందితుల అరెస్టు భేష్

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: హిందూపురం ప్రాంతంలో చోటు చేసుకున్న అత్యాచార ఘటనలో నిందితులను పోలీసు యంత్రాంగం 48 గంటల్లోనే అరెస్టు చేయడం అభినందనీయమని శ్రీసత్యసాయి జిల్లా తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి రామసుబ్బమ్మ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని తెదేపా కార్యాలయంలో అత్యాచార ఘటనపై మంగళవారం తెలుగు మహిళలు పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. వైకాపా ప్రభుత్వ పాలనలో చోటు చేసుకున్న అత్యాచార, అమానవీయ ఘటనలపై చర్యలు అంతంత మాత్రమేనని దుయ్యబట్టారు. నాడు కఠిన చర్యలు తీసుకుని ఉంటే నేడు ఇలాంటి ఘటనలకు ఆస్కారం ఉండేది కాదన్నారు. మాజీ మంత్రి ఉషశ్రీ కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేసేముందు తమ ప్రభుత్వ హయంలో జరిగిన ఘటనలను గుర్తు చేసుకోవాలని హితవు పలికారు. మంత్రిగా ఉన్న సమయంలో కళ్యాణ దుర్గంలో చోటు చేసుకున్న ఘటనను మరిచిపోయావా? అంటూ విమర్శలు గుప్పించారు.

గొర్రెల దొంగతనం కేసులో నలుగురి అరెస్టు

ఓబుళదేవరచెరువు, న్యూస్‌టుడే: మండలంలోని మనిగే రంగయ్యానాయుడుకు చెందిన గొర్రెలను దొంగిలించిన కేసులో నలుగురిని అరెస్ట్ చేసినట్లు సీఐ నరేంద్రారెడ్డి, ఎస్సై మల్లికార్జునరెడ్డి తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. ఈనెల 11వ తేదీ రాత్రి మిట్టపల్లి రంగయ్యానాయుడుకు చెందిన 10 గొర్రెలను దుండగులు దొంగిలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం పోలీసులు కదిరి-హిందూపురం ప్రధాన రహదారిలో కొత్తరోడ్డు వనుకువారిపల్లి వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా నిందితులను గుర్తించి పట్టుకున్నారు. వీరిలో ప్రకాశం జిల్లా బాపట్లకు చెందిన శివశంకర్‌తో పాటు అతడి మిత్రుడు వెంకటేశ్వర్లు, మిట్టపల్లికి చెందిన వరప్రసాద్, చీరాలకు చెందిన పాల్‌రాజు ఉన్నారు. వీరంతా మద్యానికి బానిసై ఆర్థిక పరిస్థితులు బాగలేకపోవడంతో దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. పట్టుబడిన దొంగల్లో శశికుమార్, వెంకటేశ్వర్లపై బాపట్లలోనూ చోరీ కేసు నమోదైనట్లు గుర్తించారు. గొర్రెలతో పాటు, ఆటోను స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు వివరించారు. సమావేశంలో ఏఎస్సైలు రమణారెడ్డి, కిశోర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో నలుగురి బలవన్మరణం



మృతిచెందిన గురుప్రసాద్

తలుపుల, న్యూస్‌టుడే: తలుపుల పంచాయతీ ఉబ్బరవాండ్లపల్లికి చెందిన ఇంటర్ విద్యార్థి గురుప్రసాద్(19) అప్పుల బాధతో ఉరివేసుకొని బలవన్మరణం చెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ రవికాంత్ తెలిపారు. వివరాలు.. ఉబ్బరవాండ్లపల్లికి చెందిన గురుప్రసాద్ తలుపుల జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇతని తండ్రి రవికుమార్ నాలుగేళ్ల కిందట చేసిన అప్పులు తీర్చలేక బలవన్మరణం చెందాడు. ఆయన చేసిన అప్పులు పెరిగిపోయి పిల్లల పాలిట గుదిబండగా మారాయి. వాటితో మనస్తాపానికి గురైన విద్యార్థి మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని మృతిచెందాడు. మృతుడి తల్లి సాయిలీల చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ వివరించారు.

అప్పుల బాధతో చేనేత కార్మికుడు..

ధర్మవరం: అప్పుల బాధ తాళలేక ధర్మవరం సత్యసాయినగర్‌కు చెందిన చేనేత కార్మికుడు మంజునాథ్ (37) విష ద్రావణం తాగి బలవన్మరణం చెందారు. సోమవారం రాత్రి ఆత్మహత్యాయత్నం చేసిన మంజునాథ్‌ను కుటుంబ సభ్యులు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ వైద్యం పొందుతూ మంగళవారం మృతి చెందారు. గార్లదిన్నె మండలం మర్తాడుకు చెందిన మంజునాథ్‌కు 14 ఏళ్ల కిందట ధర్మవరానికి చెందిన సుప్రియతో వివాహమైంది. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. చేనేత మగ్గం నేస్తూ జీవనం చేసే మంజునాథ్ తెలిసినవారు, వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేశారు. కొంతకాలంగా వడ్డీ వ్యాపారుల నుంచి ఒత్తిళ్లు అధికం కావడంతో అప్పుల బాధ భరించలేక విష ద్రావణం తాగి మంజునాథ్ ఆత్మహత్య చేసుకున్నాడని భార్య సుప్రియ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ధర్మవరం రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిదండ్రులు విడిపోయారని మనస్తాపం

అనంత నేరవార్తలు: తల్లిదండ్రులు విడిపోవడంతో మనస్తాపానికి గురైన కుమారుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. అనంతపురం గ్రామీణం తాటిచెర్లకు చెందిన నాగిరెడ్డి భార్యతో నాలుగేళ్ల క్రితం విడిపోయారు. ఆమె కుమార్తెను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. పెద్ద మనుషులు పలుమార్లు పంచాయితీ చేసినా రాలేదు. తల్లి దూరంగా ఉండటం, కుమారుడు శివకుమార్ (17) ఒంటరితనాన్ని భరించలేకపోయాడు. తీవ్ర మనస్తాపానికి గురై మంగళవారం ఇంటట్లో ఉరి బిగించుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రైలు కిందపడి కూలీ ..



రంగనాయకులు

తాడిపత్రి: తాడిపత్రి మండలం చిన్నపొలమడ గ్రామానికి చెందిన కూలీ రంగనాయకులు (50) మంగళవారం మధ్యాహ్నం చల్లవారిపల్లి గ్రామ సమీపాన రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపిన వివరాల మేరకు. . అతను కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వైద్యం చేయించుకున్నా ఆరోగ్యం బాగా కాకపోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతనికి భార్య లక్ష్మీదేవి, ఇద్దరు కుమారులున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసు అపహరణ

తాడిపత్రి, న్యూస్‌టుడే : తాడిపత్రిలోని సీపీఐ కాలనీలో ఓ వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తి లాక్కెళ్లిన ఘటన మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆ కాలనీకి చెందిన వృద్ధురాలు రంగమ్మ ఇంటి బయట కూర్చొని ఉండగా ద్విచక్ర వాహనంపై వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి చిరునామా అడిగాడు. ఆమె మాట్లాడుతుండగా.. హఠాత్తుగా మెడలో ఉన్న మూడు తులాల బంగారు గొలుసును లాక్కొని బైక్‌పై వెళ్లిపోయినట్లు బాధితురాలు తెలిపారు. బంగారం గొలుసు విలువ రూ.2 లక్షలకు పైగా ఉందని వాపోయారు. దుండగుడు హెల్మెట్ ధరించాడని స్థానికులు తెలిపారు. సోమవారం రాత్రి అదే వీధికి చెందిన రామిరెడ్డి ద్విచక్రవాహనం కూడా గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పట్టణ సీఐ సాయిప్రసాద్ తెలిపారు.

హిందూపురం
• హిందూపురం • పెనుకొండ • మడకశిర


మధూడిలో రథోత్సవంలో వీరభద్రస్వామి

భక్తిశ్రద్ధలతో జ్యోతుల ఉత్సవం

అగళి, న్యూస్‌టుడే: నరసంబూది గ్రామంలో మంగళవారం లక్ష్మీరంగనాథస్వామికి గ్రామస్థులు జ్యోతుల ఉత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దసరా సందర్భంగా వైభవంగా పూజలు చేపట్టి భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. మధూడి వీరభద్రస్వామికి మంగళవారం రాత్రి రథోత్సవం నిర్వహించారు. బీరలింగలు, గొరవయ్యలు, వీరగాసెలు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

పట్టణ సుందరీకరణపై ఆరా

పెనుకొండ, న్యూస్‌టుడే: పట్టణ సుందరీకరణపై మంగళవారం మంత్రి సవిత అధికారులు, ఎన్జీవోలతో సమావేశమై అభివృద్ధి పనులపై ఆరా తీశారు. పట్టణ శివారులోని 44వ జాతీయ రహదారిపై శ్రీకృష్ణదేవరాయల కూడలిలో స్వాగత తోరణం వద్ద సుందరీకరణకు సంబంధించి చేపట్టాల్సిన అంశాలను గురించి చర్చించారు. శ్రీకృష్ణదేవరాయల విగ్రహం వద్ద లైటింగ్, పార్కు ఏర్పాటు, కూడలిలో బస్టాండ్ అభివృద్ధి పై ర.భ.శాఖ, పర్యాటకశాఖ, నగరపంచాయతీ అధికారులతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఎన్జీవోల ద్వారా అభివృద్ధి పనులు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించేవిధంగా అధికారును ఆదేశించారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాసులు, ఎన్జీవోల ప్రతినిధులు, పార్టీ శ్రేణులు మంత్రి వెంట ఉన్నారు.

బస్సు సౌకర్యం సద్వినియోగం చేసుకోండి

మడకశిర గ్రామీణం: అగళి, రొళ్ల మండల ప్రజల సౌకర్యం కోసం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్యే గుండుమల తిప్పేస్వామి చొరవతో శిర నుంచి మడకశిరకు బస్సు సౌకర్యం కల్పించినట్లు డిపో మేనేజరు రామసుబ్బయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం నుంచి ప్రతి రోజు ఉదయం 5 గంటలకు శిరలో బయలుదేరి అగళి మీదుగా మడకశిరకు చేరుకునే ఈ బస్సు సౌకర్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సోమందేపల్లి : ద్విచక్ర వాహనాలు, గృహాల్లో దొంగతనాలు జరిగే నగదు, బంగారు ఆభరణాలు చోరీకి గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు పాటించాలని ఎస్సై రమేశ్‌బాబు తెలిపారు. మంగళవారం రాత్రి ఆయన మాదిరేనగర్ వాసులకు చోరీలు, సైబర్ క్రైమ్ గురించి అవగాహన కల్పించారు.

పంచాయతీ కార్యదర్శిని కొనసాగించండి

అమరాపురం: కె.శివరం పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న నాగమణిని బదిలీ చేయకుండా కొనసాగించాలని ఆ గ్రామస్థులు మంగళవారం ఎంపీడీవో రామారావుకు వినతి పత్రం అందించారు.

పారిశుద్ధ్య కార్మికులకు సరకుల పంపిణీ

కొడిగెనహళ్లి (పరిగి): కొడిగెనహళ్లి పంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న 25 మంది పారిశుద్ధ్య కార్మికులకు పరిగి మండల భాజపా అధ్యక్షుడు బంగారు చంద్ర ఆధ్వర్యంలో మంగళవారం నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. ఎంపీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి, బజరంగ్ దల్ నవీన్, విట్టాపల్లి నాగరాజు, జయరామప్ప, నీలకంఠరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆమిదాలగొందిలో పొలం పిలుస్తోంది

మడకశిర గ్రామీణం: మండలంలోని ఆమిదాలగొంది గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి తిమ్మప్ప కంది, మొక్కజొన్న, పత్తి పంటల్లో చేపట్టాల్సిన సస్య రక్షణ చర్యలపై రైతులకు తెలియజేశారు.

విపత్తుపై ముందస్తు చర్యలు

హిందూపురం గ్రామీణం : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్నందున ముప్పు వాటిల్లకుండా పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీవో, డీఎల్‌పీవో, ఎమ్పీడీవోల సూచనలతో మండల పరిధిలోని గోళ్లాపురం, చౌళూరు, తూముకుంట, కొటిపి తదితర 14 పంచాయతీల్లోనూ గ్రామకార్యదర్శులు, సిబ్బంది మంగళవారం గ్రామాల్లో తిరిగి మైకుల ద్వారా, దండోరా వేయించి ప్రజలకు అవగాహన కల్పించారు.

రావికుంటలో పడి వృద్ధురాలి మృతి

గోరంట్ల, న్యూస్‌టుడే: గోరంట్లలోని రెడ్డి వారివీధికి చెందిన బీబీజాన్(83) అనే వృద్ధురాలు మంగళవారం ప్రమాదవశాత్తు ఇంటికి సమీపంలో ఉన్న రావికుంటలో పడి మరణించింది. కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాల మేరకు.. బీబీజాన్ మానసిక వికలాంగురాలు. తెలియకుండా కుంటపైపు వెళ్లి అందులోపడి చనిపోయినట్లు తెలిపారు. మనవడు అన్సర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శేఖర్ పేర్కొన్నారు.

నీటి వనరులపై నిర్లక్ష్యం

చెరువులకు మరమ్మతు కరవు.. తుపాను హెచ్చరికతో రైతుల్లో ఆందోళన


గంగంపల్లిచెరువు తూము మరమ్మతు చేసుకుంటున్న రైతులు

గోరంట్ల, సోమందేపల్లి, రొద్దం, అమరాపురం, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా తుపాను ప్రభావంతో నాలుగు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికలు జారీచేసిన నేపథ్యంలో నీటివనరుల విషయంలో ఆయకట్టు రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. చెరువుల నుంచి నీటి లీకేజీ, తూము, మరవలు రిపేరీలు, చెరువుకట్టలు బలహీనంగా ఉండడం వంటి సమస్యలు చాలాచోట్ల కనిపిస్తున్నాయి. దీంతో రైతుల్లోనూ భయాందోళన మొదలైంది.

జలశక్తి అభియాన్ కింద ప్రతిపాదనలు పంపాం

పెనుకొండ నియోజకవర్గంలోని అయిదు మండలాల పరిధిలోని నీటివనరుల మరమ్మతుల కోసం కేంద్రపథకం జలశక్తి అభియాన్ కింద రూ.101 కోట్లతో ప్రతిపాదనలు పంపాము. వర్షాకాలంలో చిన్నచిన్న సమస్యలు ఏర్పడుతున్నాయి. అప్రమతంగా ఉన్నాం. ఎక్కడా ఆందోళన పరిస్థితులు లేవు. – లక్ష్మీనారాయణ, నీటిపారుదలశాఖ డీఈఈ

గోరంట్ల మండలంలో..

● మల్లాపల్లి చెరువు: ఈచెరువు కింద అధికారికంగా 161 ఎకరాల ఆయకట్టు ఉంది. మల్లాపల్లి, కొత్తపల్లి, బూగానపల్లి, తదితర గ్రామాల రైతులు ఈచెరువునీటిపై ఆధారపడి పంటలు సాగుచేస్తారు. పది రోజులు కిందట కురిసిన వర్షాలకు చెరువు మరవ పారుతోంది. తూమువద్ద లీకేజీ అవుతుండడంతో రైతుల ఇసుకబస్తాలు వేస్తూ నానా అవస్థలు పడుతున్నారు. నీటిపారుదలశాఖ జిలా ఎస్ఈ విశ్వనాథరెడ్డి, స్థానిక తహసీల్దార్ మారుతి పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. డీఈఈ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మరమ్మతులు జరుగుతున్నాయి. ప్రస్తుతం భారీవర్షాల హెచ్చరికలు జారీకావడంతో అధికారులు మరింత అప్రమత్తమయ్యారు.

● గంగంపల్లి చెరువు: ఈచెరువు విషయంలో అధికారుల నిర్లక్ష్యంపై రైతులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. ఈచెరువు పరిధిలో 99 ఎకరాల ఆయకట్టు ఉండగ, ఎగువ గంగంపల్లి, దిగువగంగంపల్లి, గోపిదేవరపల్లి, తండా రైతులు ఆధారపడి పంటలు సాగుచేస్తున్నారు. మరవ శిథిలావస్థలకు చేరుకోవడం, తూముద్వారా నీటి లీకేజీ అవుతోంది.

అమరాపురం : చెరువు తూము శిథిలవస్థకు చేరింది. ఐదేళ్ల క్రితం తూముకు ఒకవైపు రాతికట్టడం కూలిపోయింది. అప్పటినుంచి మరమ్మతు చేయనేలేదు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చెరువుకు నీరు చేరుతోంది. ఈ విషయమై ఇరిగేషన్ ఏఈ భార్గవను వివరణ కోరగా చెరువుల తూములు, మరవల మరమ్మతు కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామని, నిధులు రాగానే మరమ్మతు చేయిస్తామని తెలిపారు.


శిథిలావస్థకు చేరిన అమరాపురం చెరువు తూము

రొద్దం మండలంలో..

● రొద్దం పెద్దచెరువు, కోగిర చెరువులకు మరమ్మతులు చేయాల్సిన అసవరం ఉంది. ఈ రెండు చెరువులు మంత్రి సవిత ఇదివరకే పరిశీలించి మరమ్మతులకు హామీ ఇచ్చారు. పనులు ప్రారంభం కావాల్సి ఉంది. రొద్దం పెద్దచెరువుపై 11 గ్రామాలు ఆధారపడి పంటలు సాగుచేసేవారు.

● సోమందేపల్లి మండలంలో: నడింపల్లి చెరువు తూము సమీపంలో లీకేజీ అవుతుండగా అధికారులు స్పందించకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

హిందూపురం: 80085 73018, పెనుకొండ: 91000 20922, మడకశిర: 76759 19016

సమస్య: రాజీవ్‌కాలనీలో రహదారిపైకి మురుగు వస్తోంది. **-నరసింహులు**
సమాధానం: సిబ్బందిని పంపి తొలగిస్తాం. **-నరేంద్రకుమార్, సర్పంచి, బిసలమానేపల్లి**
సమస్య: మైదుగోళంలో నీరు వృథాగా పోతుంది. **- నూర్జహాన్**
సమాధానం: కుళాయిలకు బిరడాలు ఏర్పాటు చేస్తాం. **- రామచంద్రారెడ్డి, సర్పంచి, మైదుగోళం. న్యూస్‌టుడే, లేపాక్షి**

సమస్య: కురుబరపల్లి పాఠశాల వద్ద ఉన్న నీటి ట్యాంకు చుట్టూ అపరిశుభ్రత నెలకొంది. **-నాగేంద్ర**
సమాధానం: శుభ్రం చేయిస్తాం. **-అమరీశ్, కార్యదర్శి, ముతుకూరు**
సమస్య: పీసీగిరి ఇందిరమ్మ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. **-నాగరాజు**
సమాధానం: రెండు రోజుల్లో ఏర్పాటు చేస్తాం. **-ఎంజారేగౌడు, సర్పంచి**
–న్యూస్‌టుడే, గుడిబండ

సమస్యల పరిష్కారం

స్పందనకు వందనం

హిందూపురం గ్రామీణం, అర్బన్, న్యూస్‌టుడే: గ్రామాలు, కాలనీల్లోని సమస్యలను ప్రజలు 'ఈనాడు'లో ప్రచురితమయ్యే "మేమున్నాం.. మీకుతోడుగా" దృష్టికి తీసుకురావడంతో సంబంధిత అధికారులు, సర్పంచులు స్పందించి పరిష్కరించారు. కగ్గల్లు పంచాయతీ పరిధిలోని సుబ్బిరెడ్డిపల్లిలో కాలువలను శుభ్రం చేయకపోవడంతో దోమలు బెడద తీవ్రంగా ఉందని ఈనెల 11న ప్రచురితమైంది. ఇందుకు సర్పంచి విజయలక్ష్మి స్పందించి పంచాయతీ పారిశుద్ధ్య పనివారల సిబ్బందిచే కాలువలను శుభ్రం చేయించి, దోమల నియంత్రణకు చర్యలు తీసుకున్నారు. కిరికెర పంచాయతీలోని మిట్టమీదపల్లిలో శివారు ప్రాంతాల్లో వీధి దీపాలను సర్పంచి భాగ్యలక్ష్మి స్పందించి ఏర్పాటు చేయించారు. హిందూపురం పట్టణంలోని ఎన్టీఆర్ కూడలి నుంచి కందూరి కాంప్లెక్స్ వరకు డ్రైనేజీల్లో పేరుకుపోయిన మురుగును మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు చొరవతీసుకొని శుభ్రం చేయించారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట : మంత్రి సవిత


గొల్లపల్లిలో రహదారి నిర్మాణానికి నిర్వహించిన భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సవిత

పరిగి, న్యూస్‌టుడే: తెదేపా ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. మంగళవారం పరిగి మండలం బీచిగానపల్లి పంచాయతీ పరిధిలోని గొల్లపల్లి, వంగలపల్లి, పాత్రగానపల్లి, ఊటుకూరు, బసనవపల్లి గ్రామాల్లో చేపట్టనున్న సీసీ రహదారుల నిర్మాణానికి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. స్థానిక ప్రజలు మాట్లాడుతూ తమ గ్రామంలో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని మంత్రి దృష్టికి తీసుకురాగా దశల వారీగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ఎస్.ఎన్.గోవిందరెడ్డి, బీచిగానపల్లి సర్పంచి బాలాజీ, పార్టీ నాయకులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సోమప్ప, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రశ్నలను రేకెత్తించే కథలు

● కొన్ని చీకట్లు.. ఓ వెలుతురు పుస్తకావిష్కరణలో వక్తలు


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు, కవులు

హిందూపురం: ఎన్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రగతి రచించిన 'కొన్ని చీకట్లు.. ఓ వెలుతురు' పుస్తకం ప్రశ్నలను రేకెత్తించేలా ఉందని కేంద్ర సాహిత్య అకాడమి యువ పురస్కార గ్రహీత డాక్టర్ వెంపల్లి షరీఫ్ అన్నారు. మంగళవారం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కెంగార మోహన్, రచయిత, కవి సడ్లపల్లె చిదరంబరరెడ్డి, అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు సిద్దగిరి శ్రీనివాసులు, రచయిత కల్లూరు రాఘవేంద్రరావు, శౌంటి జయప్రకాశ్, రాజశేఖర్‌రెడ్డి, రచయిత్రి మాడుగుల సులోచన తదితరులు పాల్గొన్నారు.

ఇరుకైన రహదారితో ఇక్కట్లు

●తొలగని ఆక్రమణలు.. ●చోదకులకు తప్పని అవస్థలు


మోడల్‌కాలనీకి వెళ్లే రహదారి

హిందూపురం, (మోడల్‌కాలని), న్యూస్‌టుడే: హిందూపురం పట్టణం నుంచి సమీపంలోని మోడల్ కాలనీ 1, 2, బసవేశ్వరనగర్, కొటిపి, ఎస్ఆర్ఎంయూ కాలనీ, లక్ష్మీదేవమ్మకాలనీ వాసులు తమ ప్రాంతాలకు వెళ్లేందుకు రహదారి ఇరుకుగా ఉండటంతో ఇబ్బందులకు గురవుతున్నారు. రహదారికి ఒక వైపు రైల్వే ప్రహరీ ఉండగా మరోవైపు ఆక్రమణలు, మురుగు కాలువ ఉంది. దీనివలన తరచూ ప్రమాదాలు చోటు చేసుకొంటున్నాయి. పెద్దఎత్తున ఈ మార్గంలో ద్విచక్ర వాహనాలు, నీటి ట్యాంకర్లు, ఇతర వాహనాలు, పాదచారులు రాకపోకలు సాగిస్తున్నారు. ఆర్టీవో కార్యాలయానికి ఈ మార్గంలో అధిక మంది వెళ్తున్నందున రహదారి రద్దీగా ఉంటోంది. ప్రధానంగా ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనాలు అధికంగా ఉండటంతో ట్రాఫిక్‌కు తరచూ అంతరాయం ఏర్పడుతోంది. దీనివలన అత్యవసర పనులకు వెళ్లేవారు తీవ్ర ఇబ్బందుల బారిన పడుతున్నారు. ఈ కాలనీలకు ప్రత్యామ్నాయ రహదారి ఉన్నప్పటికీ దాదాపు నాలుగు కిలోమీటర్లు చుట్టిరావాల్సి ఉన్నందున ఎక్కువ మంది ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తున్నారు. ఈ రహదారి విస్తరించాలని ఇప్పటికే ఎమ్మెల్యే బాలకృష్ణ దృష్టికి పలు పర్యాయాలు స్థానికులు తీసుకెళ్లారు. ఈ విషయంపై 'న్యూస్‌టుడే' ఆర్అండ్‌బీ ఏఈ మోహన్ దృష్టికి తీసుకెళ్లగా ప్రస్తుతం ఈ రహదారిలో ఆక్రమణలు ఉన్నాయని అందువలన రహదారి మరమ్మతులకు ప్రతిపాదనలు చేస్తామన్నారు.

సమస్య ఉన్న కాలనీలు : 6
నివాస గృహాలు : 4 వేలు
జనాభా : 12 వేలకు పైగా..

కుంట కాదు.. రోడ్డే



పెనుకొండ పట్టణంలోని మడకశిర రోడ్డు పక్కన వైఎస్సార్ కూడలిలో పలువురు రియల్ఎస్టేట్ వ్యాపారులు ప్రైవేటు స్థలంలో రోడ్డు వేశారని దశబ్దాల కాలం నుంచి ఉన్న రోడ్డును దారి మళ్లించడంతో రోడ్డుపై వర్షం నీరు నిల్వచేరడంతో రోడ్డు కుంటలను తలపిస్తోంది. వాహనదారులకు, పాదచారులకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి రోడ్డు సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, పెనుకొండ

వృథా నీరు.. అరికట్టని తీరు



అగ్రహారంలోని ప్రధాన రోడ్డు పక్కన ఉన్న ట్యాంకు నుంచి తాగు నీరు వృథా అవుతోంది. విద్యుత్తు ఉన్న సమయంలో మోటారు ఆన్ చేయడంతో ట్యాంకు నిండి వృథా అవుతోంది. ఈ విషయాన్ని సర్పంచి రాజన్న దృష్టికి తీసుకెళ్లగా ట్యాంకుకు వెళ్లే పైపునకు గేటువాల్వు వేసి వృథా అరికడతామన్నారు. –న్యూస్‌టుడే, రొళ్ల

రహదారి ఎప్పుడు బాగుపడేనో...!



హిందూపురం పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ఉన్న సాయిబాబా ఆలయం పొడువునా సిమెంటు రోడ్డు వేశారు.. పక్కన నివాస గృహాలకు మరిచారు. ఈ రహదారి నుంచి రహమత్‌పూర్ సర్కిల్‌కు వెళ్లడానికి దగ్గర కావడంతో నిత్యం వాహనదారులు సంచరిస్తుంటారు. వర్షం వచ్చిందంటే మరీ అధ్వానంగా మారుతోంది. రోడ్డు నిర్మిస్తే బాగుంటుందని స్థానికులు కోరుతున్నారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులను వివరణ కోరగా చర్యలు తీసుకుంటామన్నారు. –న్యూస్‌టుడే, హిందూపురం అర్బన్

బీటీఆర్ కాలనీలో నడక నరకమే..

సిమెంటు రోడ్లపై మురుగు పరుగు

పెనుకొండ, న్యూస్‌టుడే: పెనుకొండ పట్టణంలోని బీటీఆర్ కాలనీలో దాదాపు 350 నివాస గృహాలున్నాయి. 1500కు పైగా జనాభా నివాసం ఉంటున్నారు. 2014-19మధ్య తెదేపా పాలనలో అంతర్గత సిమెంటు రోడ్లు నిర్మించారు. కాలనీలో కొన్ని వీధుల్లో మాత్రమే కాలువలు వేయగలిగారు. అంతలో ప్రభుత్వం మారడంతో కాలువలు నిర్మాణం ఆగిపోయింది. దీంతో నివాస గృహాల్లోని వృథా నీరు సిమెంటు రోడ్లపై నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. ప్రస్తుతం వాతావరణ మార్పుతో దోమల ఉద్ధృతి అధికమైందని, రాత్రులు ప్రశాంతంగా నిద్రపోలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలోని మసీదుకు వెళ్లే ప్రధాన రోడ్డులో మురుగు నీరు పారుతుండడంతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మారుతీనగర్ నుంచి బీటీఆర్‌కాలనీలోని మసీదుకు వెళ్లే ప్రధానరోడ్డులో మురుగు నిలిచిపోయి దుర్గంధం వ్యాపిస్తోంది. ఈమార్గంలో నడవలేక స్థానికులు పక్కనే ఉన్న ఓ పునాదిమీద నుంచి వెళ్తున్నారు. గత ప్రభుత్వంలో మంత్రులు, ఎమ్మెల్యేలు గడపగడపకు వెళ్లిన సమయంలో పలుమార్లు స్థానికులు డ్రైనేజీలు నిర్మించాలని విన్నవించినప్పటికీ ఫలితం లేకపోయింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనైనా డ్రైనేజీలు నిర్మిస్తారని స్థానికులు ఆశగా ఎదురుచూస్తున్నారు. అధికారులు, పాలకులు ఆదిశగా చర్యలు చేపట్టాల్సి ఉంది.


బీటీఆర్‌కాలనీలో సిమెంటు రోడ్డుపై పారుతున్న మురుగు


మసీదుకు వెళ్లే రోడ్డుపై ఇలా..

పరిశీలించి చర్యలు చేపడతాం

కాలనీల్లో పరిశీలించి సమస్యల పరిష్కరించేలా చర్యలు చేపడతాం. నగరపంచాయతీలో ఏఈ ఇటీవల బదిలీఅయ్యారు. నూతన ఏఈ బాధ్యతలు చేపట్టగానే ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తాం. నిధులు మంజూరవ్వగానే పనులు పూర్తి చేయిస్తాం.
-శ్రీనివాసులు, కమిషనర్, నగరపంచాయతీ, పెనుకొండ


అమరాపురం మండలం కె.శివరంలో భూమిపూజ చేస్తున్న అధికారులు, నాయకులు

గ్రామాల్లో ఘనంగా పల్లె పండగ

గ్రామాల్లో పల్లె పండగ కార్యక్రమాన్ని అధికారులు, ప్రజా ప్రతినిధులు, తెదేపా నాయకులు ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని గ్రామాల్లో సిమెంటు రోడ్లకు భూమి పూజలు చేశారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచులు, తెదేపా నాయకులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు. **-న్యూస్‌టుడే బృందం**

రెండు రోజులు నీటి సరఫరాకు అంతరాయం

పెనుకొండ : గొల్లపల్లి జలాశయం నుంచి పెనుకొండకు నీటిని సరఫరా చేస్తున్న పైపులైన్ మరమ్మతులు చేయనున్నారు. దీని కారణంగా రెండురోజుల పాటు పట్టణంలోని ఎగువగడ్డ, జీఐసీ కాలనీ, వజ్రాలపేట, బోయగేరి, కొత్తపేట, చెరువురోడ్డు కాలనీల్లో నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు కమిషనర్ శ్రీనివాసులు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

పుట్టపర్తి
• పుట్టపర్తి • ధర్మవరం • కదిరి • రాప్తాడు

అర్హులైన రైతులకు భూపంపిణీ చేయాలని వినతి

అమడగూరు, న్యూస్‌టుడే: అమడగూరు మండలంలో గతంలో పశువుల మేత కోసం ప్రభుత్వ భూములను కేటాయించారు. రెవెన్యూ అధికారులు మేత బీడు భూములను స్వాధీనం చేసుకొని భూమి లేని నిరుపేదలకు పంపిణీ చేయాలని గ్రామస్థులు కమ్యూనిస్టు పార్టీ నాయకులు మున్నా, రామచంద్ర డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ రామనాథరెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. కంచనగారి పల్లి సర్వే నంబరు 453లో దాదాపు 15 ఎకరాలను పశువుల మేతకు ఉపయోగిస్తున్నారు. కొంత మంది భూస్వాములు ఆ భూములను ఆక్రమించుకొని అనుభవిస్తున్నట్లు ఫిర్యాదు చేశారు. వాటిని కాపాడాలని కోరారు. నాయకులు రవి, సరస్వతి, వెంకట్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

పుట్టపర్తి, న్యూస్‌టుడే: సమాజంలో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనే ధ్యేయంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వయోజన విద్యను అమలు చేయాలని అధికారులను కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులతో వయోజనవిద్య అమలుపై సమీక్షించారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా ఉల్లాస్ (సమాజంలో అందరికీ జీవితకాల అభ్యాసం) అనే కార్యక్రమం ద్వారా సమాజంలో ఉన్న నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనే ధ్యేయంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వయోజన విద్యాశాఖ డైరెక్టర్ అంజనేయులు, ఏపీవో సుబ్రహ్మణ్యం రెడ్డి, నోడల్ అధికారి మధుసూదన్, జిల్లా విద్యాశాఖ అధికారిణి మీనాక్షి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఏసీ డీఎస్ పీడీ నాగమల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: జిల్లాలో అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంతో మండలం, గ్రామాల్లో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మల్లికార్జున సూచించారు. సోమవారం డీఈ శంకర్నాథ్‌తో కలిసి ముదిగుబ్బలోని ఉప్పలపాడు సీపీడబ్ల్యూ పథకం, సత్యసాయి తాగునీటి పథకాన్ని పరిశీలించారు. మరో రెండు,మూడు రోజులు అధిక వర్షాలు కురిసే అవకాశముండటంతో ఎక్కడ తాగునీటికి ఇబ్బందులు రకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్‌కు సూచించారు. అనంతరం బత్తలపల్లి మండలంలోని అప్రాచెరువులోని తాగు నీటి సంపును పరిశీలించారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే: కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లి హమాలీ కాలనీలో నివసిస్తున్న యంగమ్మ అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి అంత్యక్రియలు నిర్వహణకు వైకాపా రాష్ట్ర బీసీ విభాగం ఉపాధ్యక్షుడు డాక్టర్ బత్తల హరిప్రసాద్ మంగళవారం స్థానిక నాయకులు ముబారక్ ద్వారా యంగమ్మ కుమారుడు నారాయణకు రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు.

శిథిల వారధులు.. ప్రమాదాలకు నిలయాలు

న్యూస్‌టుడే: ధర్మవరం పట్టణం, ముదిగుబ్బ

ధర్మవరం నియోజకవర్గంలో వంతెనలు, కల్వర్టులు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో ముప్పుగామారి ప్రాణాపాయం జరిగే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ వారధులపై ప్రయాణించాలంటేనే వాహన దారులు భయాందోళన చెందుతున్నారు. ఏటా వర్షాకాలంలో దెబ్బతిన్న కల్వర్టులు, వంతెనలు మరింత ప్రమాదకరంగా మారుతున్నాయి. అధికారులు నిర్వహణ చర్యలు చేపట్టకపోవడంతో ప్రయాణికులు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారు. ఏళ్లు గడుస్తున్నా సమస్యలు పరిష్కారం కావడం లేదని, దీంతో రాత్రివేళల్లో ప్రమాదాలకు గురవుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్యలు పరిష్కరిస్తే ప్రయాణం సాఫీగా సాగిపోతుందని కోరుతున్నారు.



సంకేపల్లి సమీపంలో కల్వర్టు దెబ్బతిని ఇలా..

ప్రమాద ఘంటికలు ఎక్కడెక్కడంటే..

- ధర్మవరం నుంచి పుట్టపర్తికి వెళ్లే మార్గంలో తుంపర్తి దగ్గర వంతెన పూర్తిగా దెబ్బతింది. శిథిలావస్థకు చేరుకోవడంతోపాటు రోడ్డు గుంతలమై అధ్వానంగా మారింది. రక్షణ దిమ్మెలులేకపోవడంతో ప్రయాణికులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు.
- దొరిగిల్లు గ్రామం దగ్గర కల్వర్టు దెబ్బతిని నెర్రలిచ్చి ఎత్తుపల్లాలుగా మారింది. కల్వర్టుకు ఇరువైపులా రక్షణ దిమ్మెలు లేవు. ముదిగుబ్బలోని ఆర్అండ్‌బీ రోడ్డు దెబ్బతిని గోతులు ఏర్పడ్డాయి. ఈ మార్గంలో ముదిగుబ్బ నుంచి పులివెందులకు నిత్యం వందలాది వాహనాలు వెళ్తుంటాయి. రాత్రివేళల్లో గోతులు కనిపించక ప్రమాదాలకు గురవుతున్నారు.
- సంకేపల్లి క్రాస్ నుంచి బి.కొట్టాలకు వెళ్లే మార్గంలో వీరనారాయణస్వామి పరుషమాలిక్ల దగ్గర వంతెనకు రక్షణ దిమ్మెలులేవు. వంతెన దిగే ప్రాంతంలో భారీగా గుంతలు పడటంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సంకేపల్లి గ్రామశివారులో కల్వర్టు శిథిలావస్థకు చేరుకుంది.
- అడవిబ్రాహ్మణపల్లితండా నుంచి యోగివేమన జలాశయానికి వెళ్లే మార్గంలో కల్వర్టు దెబ్బతింది. ఇరువైపులా రక్షణ దిమ్మెలు పూర్తిగా దెబ్బతిని ప్రమాదకరంగా మారాయి. తోపుడు బండ్లు, లోడుతో ట్రాక్టర్లు వచ్చినపుడు ఎప్పుడే ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు.
- తాడిమర్రి నుంచి పిన్నదరికి వెళ్లే మార్గంలో పీపీ బీటర్ కుడికాలువపై ఉన్న వంతెన పూర్తిగా దెబ్బతింది. రక్షణ దిమ్మెలు విరిగిపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.



ముదిగుబ్బ-పులివెందుల మార్గంలో దొరిగల్లు దగ్గర విరిగిపోయిన కల్వర్టు

ప్రతిపాదనలు పంపించాం

నియోజకవర్గంలో దెబ్బతిన్న కల్వర్టులు, వంతెనలను గుర్తించి బాగు చేసేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైతే వెంటనే పనులు చేపట్టి సమస్యలు పరిష్కరిస్తాం.

- నాగపుల్లంరావు, ఆర్అండ్‌బీ డీఈ, ధర్మవరం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

పుట్టపర్తి: 80085 73039, కదిరి: 80085 73033, ధర్మవరం: 99596 98222

సమస్య: ముదిగుబ్బలోని రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గంలో రహదారిపై ద్విచక్ర వాహనాలు అడ్డంగా పార్కింగ్ చేసి వెళ్తున్నారు. సరకుల ఆటోలు వచ్చేందుకు ఇబ్బందిగా మారింది. **- దుకాణదారులు**

సమాధానం: రహదారిపై ఎక్కడపడితే అక్కడే వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకుంటాం. **- శ్యామరావు, గ్రామీణ సీఐ, ముదిగుబ్బ**

సమస్య: ముదిగుబ్బలోని పాతూరులో వీధిలైట్లు సక్రమంగా వెలగడం లేదు. శివారు ప్రాంతంలో చిమ్మచీకట్లు కమ్ముకుంటున్నాయి. **- రమేష్, ముదిగుబ్బ**

సమాధానం: మరమ్మతులకు గురైన వీధిలైట్లు బాగు చేయిస్తాం. **- చక్రపాణి, పంచాయతీ కార్యదర్శి, ముదిగుబ్బ**

సమస్య: మంగళమడక గ్రామంలోని రహదారులపై నీళ్లు వస్తుండటంతో రోడ్లంతా అపరిశుభ్రంగా మారుతోంది. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. **- గ్రామస్థులు**

సమాధానం: డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయించి మురుగు సమస్య పరిష్కరిస్తాం. **- ధనలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి, మంగళమడక**

- న్యూస్‌టుడే, ముదిగుబ్బ

చెత్త తొలగించిన మున్సిపల్ అధికారులు

కదిరి పట్టణం: 'డంప్‌యార్డులా ప్రయాణ ప్రాంగణం' శీర్షికన సోమవారం 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు మున్సిపల్ అధికారులు స్పందించారు. కుటాగుళ్ల వద్ద పులివెందుల క్రాస్‌లోని ప్రయాణ ప్రాంగణం చుట్టూ పారిశుద్ధ్య సిబ్బంది చెత్తను వదలడంతో అపరిశుభ్రంగా మారింది. ఈ విషయంలో చిత్రవార్త ప్రచురించడంతో మున్సిపల్ అధికారులు చెత్తను తొలగించి శుభ్రంగా మార్చేశారు.

ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడండి



కలెక్టర్ టీఎస్‌చేతన్

పుట్టపర్తి, న్యూస్‌టుడే: భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలో ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి దిశా, నిర్దేశం చేశారు. గ్రామ, మండలస్థాయి అధికారులు ప్రధాన కేంద్రంలో అందుబాటులో ఉండాలన్నారు. జిల్లాలో ఉన్న మధ్య తరహా ప్రాజెక్టుల నిల్వ సామర్థ్యం ఎంత, ప్రస్తుతం ఉన్న వివరాలను వెంటనే తెలియజేయాలని సూచించారు. వర్షాలు కురుస్తున్న ప్రాంతాల్లో ప్రతి గంటకు తహసీల్దార్లు పరిస్థితులపై నివేదిక ఇవ్వాలని, ఏదైనా సంఘటన జరిగితే జిల్లా కేంద్రానికి సమాచారం అందించాలన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పుట్టపర్తి, న్యూస్‌టుడే: జన సంరక్షణ, పీఎం ఎస్‌బీవై, పీఎం జేజేబీవై పథకాలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ టీఎస్ చేతన్ కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి, వందశాతం లక్ష్యాలు సాధించాలని సూచించారు. జిల్లాలోని 467 గ్రామ పంచాయతీల్లో బుధవారం నుంచి జనవరి 2025 జనవరి 15 వరకు బ్యాంకుల్లో జనసంరక్షణ, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డీఆర్‌డీఏ, పశుసంవర్ధక, మత్స్యశాఖ, పంచాయతీ అధికారి సమన్వయం చేసుకోవాలని సూచించారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతోందని ప్రజాప్రతినిధులు, తెదేపా నాయకులు పేర్కొన్నారు. మంగళవారం కదిరి, పుట్టపర్తి, ధర్మవరం, రాప్తాడు నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా సీసీ రోడ్లు, మురుగు కాలువలు తదితర అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. **- న్యూస్‌టుడే బృందం**



పుట్టపర్తి గ్రామీణం: అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె

తొలగిన విద్యుత్తు అంతరాయాలు

కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే: కదిరి మండలం చలమకుంట్లపల్లి పంచాయతీ పరిధిలోని జౌకల గ్రామ ప్రధాన రహదారిలో ఉన్న విద్యుత్తు స్తంభానికి సమీపంలోని చెట్ల కొమ్మలు, తీగలు అల్లుకుపోయి ప్రమాదకరంగా మారింది. ఈ సమస్యపై 'గాలి వీచినప్పుడల్లా సమస్య' శీర్షికతో మంగళవారం 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి కదిరి గ్రామీణ మండల విద్యుత్ శాఖ ఏఈ గౌరీ శంకర్ స్పందించారు. సిబ్బందితో విద్యుత్తు స్తంభానికి చుట్టుకొన్న చెట్లకొమ్మలు, తీగలను తొలగించారు.





కదిరి: కలాం చిత్రపటానికి పూలమాల వేసిన మెప్మా, నూర్‌బాషా సంఘం ప్రతినిధులు

అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయం

శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం దేశానికి చేసిన సేవలు మరువలేనివని ఆదర్శ సేవా సంఘం ప్రతినిధులు అన్నారు. మంగళవారం ధర్మవరం, పుట్టపర్తి, కదిరి, రాప్తాడు నియోజకవర్గాల్లో అబ్దుల్‌కలాం జయంతి వేడుకలు నిర్వహించారు. అబ్దుల్‌కలాం చిత్రపటంతో పాటు రతన్ టాటా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారతరత్న ఏపీజే అబ్దుల్ కలామ్ శాస్త్రవేత్త, రాష్ట్రపతిగా దేశానికి సేవలు అందించారని కొనియాడారు. విద్యార్థులు ఆయనను ఆదర్శంగా తీసుకుని లక్ష్యాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే బృందం**

మండల సమస్యలపై చర్చ

బత్తలపల్లి, న్యూస్‌టుడే: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ సమావేశాన్ని ఎంపీపీ బగ్గిరి త్రివేణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీధుల్లో మురుగు కాలువలు శుభ్రం చేయించాలని, గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా చూడాలన్నారు, పలు అంశాలను ప్రస్తావించారు. పలు సమస్యలను ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీడీవో నరసింహనాయుడు, తహసీల్దార్ స్వర్ణలత, జడ్పీటీసీ సభ్యురాలు కోటి సుధా, వైస్ ఎంపీపీ గజ్జల వెంగళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వంట మనిషి పోస్టుకు 17 దరఖాస్తులు

అమడగూరు, న్యూస్‌టుడే: మండలంలోని కేజీబీవీలో టైప్-4 కేటగిరిలో బోధనేతర సిబ్బంది పోస్టులైన రెండు సహాయ వంట మనిషి పోస్టులకు చివరిరోజైన మంగళవారం మొత్తం 17 దరఖాస్తులు వచ్చినట్లు ఎంఈవో జిలాన్‌బాష తెలిపారు. ఒప్పంద ప్రాతిపదికన పోస్టులను భర్తీ చేయడానికి స్థానిక మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించినట్లు చెప్పారు. ఎంపికైన అభ్యర్థులు పేరంవాండ్లపల్లిలోని ఆదర్శ పాఠశాల బాలికల వసతి గృహంలో విధులు నిర్వహించాల్సి ఉంటుందని వివరించారు.

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా

బుక్కపట్నం, న్యూస్‌టుడే: గ్రామాల్లో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ కృష్ణమూర్తి హెచ్చరించారు. బుక్కపట్నం మండలంలోని జానకంపల్లి, సిద్ధరాంపురం గ్రామాల్లో మంగళవారం ఎస్ఐ పర్యటించారు. గ్రామస్థులకు సూచనలు చేశారు. గ్రామాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు కనపడితే తమకు సమాచారం అందించాలన్నారు.

స్తంభాన్ని ఢీకొన్న ఐచర్.. తప్పిన ప్రమాదం

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: కదిరి పట్టణం కుటాగుళ్ల వద్ద మంగళవారం రాత్రి ఐచర్ వాహనం విద్యుత్తు స్తంభం మీదుగా దూసుకెళ్లిన ఘటనలో త్రుటిలో ప్రమాదం తప్పింది. ఐచర్ వాహనం జాతీయ రహదారి నుంచి కుటాగుళ్లలోకి వెళ్లే క్రమంలో స్తంభం వైపునకు దూసుకెళ్లింది. స్థానికులు కేకలు వేయడంతో చోదకుడు వాహనాన్ని ఆపివేశారు. విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలిగింది. సమాచారం అందుకున్న ఏఈ చెన్నకృష్ణ సిబ్బందితో అక్కడికి చేరుకుని సరఫరాను పూర్తిగా నిలిపివేశారు. పొక్లెయిన్ సాయంతో వాహనాన్ని పక్కకు జరిపి మరమ్మతులు చేసి సరఫరాను పునరుద్ధరించారు.

వస్త్ర వ్యాపారుల పరస్పర ఫిర్యాదు

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: కదిరి పట్టణం కాలేజిరోడ్డులోని వస్త్ర వ్యాపారులు ఘర్షణపడి పరస్పరం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసులు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు. ఇర్ఫాన్, సిద్దిఖ్‌ల మధ్య వ్యాపారం విషయంలో గొడవలు ఉన్నాయి. సిద్దిఖ్ తనమిత్రులైన జునేద్, తాహిర్, యూనస్, ఇసాక్ కలిసి ఇర్ఫాన్ సోదరుడు నూర్‌మహమ్మద్‌పై దాడిచేసి గాయపరిచారు. ఇర్ఫాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడి చేసిన ఐదుగురిపై కేసు నమోదు చేశారు. నూర్ మహమ్మద్, బాబ్జాన్, ఇర్ఫాన్ తమపై కర్రలు, రాళ్లతో దాడిచేసి గాయపరిచారని తాహిర్ ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు.


మద్యం విక్రేతల అరెస్టు

కదిరి పట్టణం: నల్లచెరువు మండలంలోని రామక్కగారిపల్లి కె.పూలకుంట గ్రామాల సమీపంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఇద్దరి నుంచి 138 పాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. రామక్కగారిపల్లి వద్ద టెట్రా పాకెట్లు అమ్ముతున్న వ్యక్తి పోలీసులను చూసి పారిపోయాడు. అక్కడ ఉన్న 48 పాకెట్లు, కె.పూలకుంట వద్ద మద్యం అమ్ముతున్న వ్యక్తి నుంచి 90 పాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నల్లచెరువు(కదిరి): మండల పరిధి చిన్నపల్లోల్లపల్లి వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. నల్లచెరువుకు చెందిన శ్రీనివాసులు, ఆయన కుమారుడు నవీన్‌లు ద్విచక్ర వాహనంపై తనకల్లు వైపు వెళ్తుండగా, అదే మార్గంలో ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొనటంతో ప్రమాదం జరిగింది. ఇందులో తండ్రీకొడుకులు గాయపడ్డారు. క్షతగాత్రులను వైద్యసేవల నిమిత్తం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు.

జీవితంపై విరక్తితో బలవన్మరణం



కె.నరసింహులు

తలుపుల, న్యూస్‌టుడే: పెద్దన్నవారిపల్లికి చెందిన కె.నరసింహులు (43) క్షయ, కడుపునొప్పి తట్టుకోలేక జీవితంపై విరక్తితో పురుగుమందు తాగి మృతిచెందినట్లు కానిస్టేబుల్ బాబునాయక్ చెప్పారు. ఆయన తెలిపిన మేరకు.. ఈనెల 5న రాత్రివేళ బహిర్భూమికి వెళ్తానంటూ ఇంట్లో చెప్పి గ్రామం బైయటకు వెళ్లి పురుగుమందు తాగాడు. ఈ విషయాన్ని మృతుడే గ్రామస్థులకు సమాచారం ఇచ్చి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. గుర్తించిన గ్రామస్థులు అతన్ని ఆసుపత్రికి తరలించారు. అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈనెల 15 తెల్లవారుజామున మృతిచెందినట్లు తెలిపారు. మృతుని భార్య ఓబులమ్మ చేసిన ఫిర్యాదు ఆధారంగా కేసునమోదు చేసిన్నట్లు వివరించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

అమడగూరు: మండలంలోని కస్సముద్రం గ్రామ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను మంగళవారం ఎస్సై వెంకటనారాయణ పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. ఆయన మాట్లాడుతూ మహమ్మదాబాద్ క్రాస్ నుంచి అమడగూరుకు అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారంతో ట్రాక్టర్‌ను సీజ్ చేసి రెవెన్యూ అధికారులకు అప్పగిస్తున్నట్లు వివరించారు.

సబ్‌జైలులో సౌకర్యాలపై ఆరా



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్‌యాదవ్

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరం సబ్‌జైలులో మంగళవారం ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ తనిఖీ చేశారు. సబ్‌జైలులో సౌకర్యాల గురించి ఆరా తీశారు. అనంతరం వివిధ కేసుల్లో సబ్‌జైలులో రిమాండ్‌లో ఉన్న వారితో మాట్లాడారు. ఎవరికైనా న్యాయవాది లేకుంటే వారికి ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని ఆయన పేర్కొన్నారు. సత్ప్రవర్తనతో మెలగాలని తెలిపారు. సబ్‌జైలు సూపరింటెండెంట్ బ్రహ్మానందరెడ్డి, న్యాయవాది నూర్ మొహమ్మద్ పాల్గొన్నారు.

కార్మికుల కుటుంబాలకు ఆర్థిక సహాయం



బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: మున్సిపల్‌శాఖలో పనిచేస్తూ ఇటీవల మృతిచెందిన పారిశుద్ధ్య కార్మికుల కుటుంబాలకు సీఐటీయూ నాయకులు ఆర్థిక సహాయం అందజేశారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో నగదు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాగేంద్ర కుటుంబానికి రూ.39,600, మల్లికార్జున కుటుంబానికి రూ.35,600 పంపిణీ చేశామని తెలిపారు. తోటి కార్మికుల చేయూతతో వారిని ఆదుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు జేవీ రమణ, నాయకులు అయూబ్‌ఖాన్, కార్మిక సంఘం జిల్లా, పట్టణ అధ్యక్షులు బాబు, ముకుంద తదిరులు పాల్గొన్నారు.

సంఘటనలపై క్షేత్రస్థాయి పరిశీలన

అమడగూరు, న్యూస్‌టుడే: అమడగూరు, ఓబుళదేవరచెరువు మండలాల సరిహద్దు సుబ్బయ్యనారవ సమీపంలోని మామిడితోటలో జరిగిన మహిళ హత్య, అమడగూరు మండలంలోని ఒక గ్రామానికి చెందిన బాలికపై జరిగిన అత్యాచార సంఘటనలపై నల్లమాడ సీఐ నరేంద్రరెడ్డి దర్యాప్తు చేపట్టారు. మంగళవారం రెండు ప్రదేశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎస్సై వెంకటనారాయణతో ఆరాతీశారు. ఇప్పటికే రెండు కేసులకు సంబంధించిన నింధితులను కోర్టుకు హాజరు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధురాలి అదృశ్యం

కనగానపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని దాదులూరుకి చెందిన ఓ వృద్ధురాలు అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. దాదులూరుకు చెందిన వృద్ధురాలు ఓబుళమ్మ ఇంటి నుంచి ఎవరికి చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయింది. చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. కనగానపల్లి పోలీసుస్టేషనులో బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ప్రహరీ నిర్మాణం ఇంకెప్పుడు?

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: మండలంలోని జొన్నలకొత్తపల్లి ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ పలుచోట్ల కూలింది. దీంతో చుట్టుపక్కల కంపచెట్లు, ముళ్లపొదలు పెరగడంతో విషపురుగులు పాఠశాల ఆవరణలోకి వస్తున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. పాఠశాల ముందు, వెనుక భాగంలో ప్రహరీ పూర్తిగా పడిపోయింది. చిన్నపాటి వర్షానికే పాఠశాల పైకప్పు, గోడలకు నెమ్ము ఎక్కింది. రెండో విడత నాడు-నేడు పథకం కింద పాఠశాల ఎంపికైనా ఇప్పటి వరకు విద్యుత్తు, మరుగుదొడ్ల నిర్మాణం మాత్రమే చేపట్టారు. ప్రహరీ లేకపోవడంతో కొందరు పశువులను పాఠశాల ఆవరణలోకి వదులుతున్నారు. ఎంఈవో-2 రమణప్పను వివరణ కోరగా నాడు-నేడు పథకంలో గోడ నిర్మాణం లేదన్నారు. పాఠశాల నిధుల కింద ప్రహరీ నిర్మించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



పడిపోయిన ప్రహరీ

రేపు విద్యుత్తు సరఫరా నిలిపివేత

కనుముక్కల (చెన్నేకొత్తపల్లి), న్యూస్‌టుడే: కనుముక్కల విద్యుత్తు ఉప కేంద్ర పరిధిలోని గ్రామాల్లో గురువారం విద్యుత్తు నిలిపివేయనున్నట్లు ఏఈ రామాంజనేయులు ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్తు ఉప కేంద్రంలో నిర్వహణ పనులు నిమిత్తం గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటలకు వరకు విద్యుత్ నిలిపి వేయనున్నట్లు తెలిపారు. రైతులు, ప్రజలు గమనించాలని కోరారు.

17న ఎద్దులబండ్ల పరుగు పోటీలు

కొత్తచెరువు: కొత్తచెరువులో వాల్మీకి జయంతి సందర్భంగా ఎద్దుల బండ్ల పోటీలు నిర్వహిస్తున్నట్లు వాల్మీకి సంఘం నాయకులు తెలిపారు. 17న ధర్మవరం రోడ్డులో విరూపన్న చెరువు ఎదురుగా ఉన్న పొలాల్లో పరుగు పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న రైతులు 16వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పరుగు పోటీలు నిర్వహించే ప్రదేశాన్ని సీఐ ఇందిర మంగళవారం పరిశీలించారు.

అద్దె వసూళ్లపై అలసత్వం

పేరుకుపోతున్న మున్సిపల్ దుకాణ సముదాయ బకాయిలు

న్యూస్‌టుడే: కదిరి పట్టణం

కదిరి మున్సిపాలిటీకి చెందిన దుకాణ సముదాయాల అద్దె బకాయిలు పేరుకుపోతున్నాయి. అద్దెల ద్వారా ప్రతినెలా మున్సిపాలిటీకి రూ.లక్షల్లో ఆదాయం వస్తోంది. రాజకీయ పైరవీలు, అధికారుల అలసత్వం కారణంగా సక్రమంగా అద్దె వసూలుపై దృష్టి పెట్టలేదు. ఫలితంగా బకాయిలు పెరిగిపోయాయి. మున్సిపల్ కార్యాలయం, టవర్‌క్లాక్, చావిడి, చౌకు, ఇక్బాల్ రోడ్డు ప్రాంతాల్లో 71 దుకాణాలు ఉన్నాయి. టవర్‌క్లాక్ వద్ద ఉన్న దుకాణం నంబరు 15 దక్కించుకున్న వ్యక్తి ఏకంగా రూ.4.29 లక్షలు, చావిడి వద్ద దుకాణం నంబరు 02 నుంచి రూ.3.75 లక్షలు, టవర్‌క్లాక్ వద్ద ఉన్న దుకాణం నంబరు 02 నుంచి రూ.3.21 లక్షలు రావాల్సి ఉంది. మరో మూడు దుకాణాలు రూ.లక్షకు పైగా బకాయి పడ్డాయి. 23వ దుకాణం నుంచి రూ.లక్షలోపు బకాయి ఉంది. అద్దెలు చెల్లించకుండా మున్సిపల్ ఆదాయానికి గండికొడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ఇక్బాల్‌రోడ్‌లోని మున్సిపల్ దుకాణ సముదాయం

టెండర్ ఒకరు.. వ్యాపారం మరొకరు

టెండర్ ద్వారా మున్సిపల్ దుకాణాలను రాజకీయ ప్రాధాన్యం ఉన్న వ్యక్తులే దక్కించుకుంటున్నారు. ప్రభుత్వం నుంచి తక్కువ అద్దెకు టెండర్‌లో దక్కించుకుని వాటిని ఇతరులకు ఎక్కువ అద్దెకు ఇస్తూ మున్సిపల్ ఆదాయానికి గండికొడుతున్నారు. ఇవేవీ అధికారులు పట్టించుకోవడం లేదు. దీనిపై దృష్టిపెట్టి అద్దెకు ఉన్నవారికే గదులు కేటాయించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. టెండరు ద్వారా గదులు దక్కించుకున్న వ్యక్తులు నెలనెలా అద్దెలు వసూలు చేసుకుంటున్నా మున్సిపాలిటీకి జమ చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గడువు ముగియడంతో 22 దుకాణాలను రెన్యువల్ చేసుకోవాల్సి ఉంది. మరో ఏడు దుకాణాల వ్యవహారం కోర్టు పరిధిలో ఉంది. మిగతా 42 షాపుల్లో వివిధ రకాల వ్యాపారాలు నిర్వహించుకుంటున్నారు.

ప్రత్యేక దృష్టి పెడతాం

బకాయిపడిన మున్సిపల్ దుకాణాల అద్దె వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెడతాం. రూ.27 లక్షలకు పైగా బకాయిలు ఉన్నాయి. టెండర్ ద్వారా గదులు దక్కించుకున్న వ్యక్తులను గుర్తించి బకాయిలు చెల్లించేలా సూచిస్తాం. అవసరమైతే న్యాయపరమైన చర్యలతో బకాయిపడిన అద్దెలను వసూలు చేస్తాం. అద్దెలు చెల్లించలేని వారి నుంచి గదులు స్వాధీనం చేసుకుంటాం.

- కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, కదిరి